## జీవో ఎంఎస్ నెంబర్ 5ను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి భాస్కర్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 5ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఎం.శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్.డి.చంద్రశేఖర్‌లు డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో నెంబర్ 5 ప్రకారం మరో నాలుగేళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఐటీ పరిశ్రమలకు కార్మిక చట్టాలను సడలిస్తూ.. ఈ జీవోను విడుదల చేసిందని దీని ప్రకారం రాష్ట్రంలో ఐటీఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాలు వర్తించవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవో ప్రకారం పనివేళలు, పని ప్రదేశంలో భద్రత, రవాణా సౌకర్యాలు, వేతనాలు, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించిన షరతులను అమలు చేయాలన్న నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వడం సరికాదన్నారు. మహిళలకు భద్రతకు సంబంధించినంత వరకు పనివేళలు కూడా ఇబ్బందికరంగా ఉన్నాయని, నైట్ షిఫ్ట్‌ల కారణంగా మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ జీవోను వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్.బాలరాజు, హెచ్ఎంఎస్ కార్యదర్శి రెబ్బరామారావు, పీఎన్‌టీయూసీ కార్యదర్శి ఎం.కే.బోస్, వివిధ సంఘాల నేతలు హరిబాబు, వెంకటరామయ్య, భరత్, భూపాల్, జనార్దన్, వెంకటేష్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు


సంధ్యారాణి,తహసీల్దార్ హిమాయత్ నగర్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** హిమాయత్‌నగర్ మండల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ సంధ్యారాణి హెచ్చరించారు. శనివారం మండల కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మూసీ పరివాహక ప్రాంతాల్లో కబ్జాకు పాల్పడిన వారిపైన కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. అనుమతులు లేకుండా బోర్‌వెల్ వేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన ఐదుగురిపై క్రిమినల్ చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై రూ.20 లక్షల వరకు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. గతంలో ఓ వ్యక్తి అనుమతి లేకుండా బోర్‌వేస్తే రూ.లక్ష జరిమానా విధించామన్నారు. మీసేవా సెంటర్‌లో కూడా ఏరోజుకు ఆరోజు అప్‌లోడ్ చేసిన ఫారమ్‌లను తెప్పించుకుంటున్నామని తెలిపారు. దళారులను నమ్మకుండా దరఖాస్తు చేసుకోవాలని క్యాస్ట్ సర్టిఫికెట్లకు 15 రోజులు, ఆదాయ సర్టిఫికెట్లకు 7 రోజులు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లకు 15 రోజుల సర్టిఫికెట్ పడుతుందన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

**చిక్కడపల్లి:** తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా వాటర్‌వర్క్స్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ సూచించారు. శనివారం డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీటిసరఫరా జరుగుతుందని, దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సమస్యను సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలన్నారు. డ్రైనేజీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వాటర్‌వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ పావని

## భక్తి శ్రద్ధలతో చండీహోమం


శంకరమఠంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

**నల్లకుంట :** పౌర్ణమి సందర్భంగా నల్లకుంట శంకర మఠం భక్తులతో పోటెత్తింది. ఉదయం శక్తి గణపతికి ఆది పూజలు కావించిన అర్చకస్వాములు చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక శారదాంబకు విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవధాన్యాలు, పసుపు, కుంకుమ, అమ్మవారికి సమర్పించిన వస్త్రాలు, కొబ్బరికాయలు హోమంలో వేసి ఆవునెయ్యితో పూర్ణాహుతి కావించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే కాలేరు


లబ్ధిదారులతో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

**అంబర్‌పేట:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి పేదింటికీ చేయూతనిచ్చాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట మండల పరిధిలో 99 కల్యాణలక్ష్మి, 57 షాదీముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, అమృతలతో కలిసి ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చొరవ తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో పేదల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ మీరాబాయి, స్థానిక బీఆర్ఎస్ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ప్రముఖ పర్యావరణవేత్త మహ్మద్ ఖాన్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** మానవ జీవితం పర్యావరణంతో ముడిపడి ఉందని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ విద్య, పర్యావరణవేత్త మహ్మద్‌ఖాన్ అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో పర్యావరణ దినోత్సవంపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ.. వివిధ ప్రకృతి వనరులు, పునరుత్పాదన శక్తి ద్వారా భవిష్యత్ తరాల కోసం పాటుపడాలని తెలిపారు. పర్యావరణం, జీవవైవిధ్యం గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అంబేడ్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ సృజన, ఆల్ ఇండియా ఉమెన్స్ సంస్థ జాయింట్ సెక్రటరీ సుప్రియబలేరా, లా కళాశాల విద్యార్థులు తదితరులున్నారు.

## ప్లాస్టిక్ పరిశ్రమలతో కులవృత్తులు కనుమరుగు


మాట్లాడుతున్న లోకిని రాజు

**చిక్కడపల్లి :** ప్రైవేటీకరణ నేపథ్యంలో ప్లాస్టిక్ పరిశ్రమల ఉత్పత్తుల వల్ల ఆదివాసీ ఎరుక కులవృత్తులు కనుమరుగవుతున్నాయని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో సంఘం నేత కోనేటి నరసింహ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించాలని కోరారు. ఎరుకల విద్యార్థులకు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రత్యేక సీట్లు కేటాయించాలన్నారు. హైదరాబాద్ కేంద్రంగా హాస్టల్ వసతితో పాటు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నూతన కమిటీ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కోనేటి నర్సింహ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్రాక్షి నర్సింహ, వెంకటేశ్వర్లు, రాజు, ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శులు నరసింహ, కేతిరి రాజశేఖర్, కోనేటి సమ్మయ్య, కోశాధికారి వనం రమేష్ తదితరులున్నారు.

# ఆగిన అభివృద్ధి పనులు!

ఇద్దరు ఎమ్మెల్యేల సమన్వయ లోపం
మూడేళ్లుగా కొనసాగుతున్న నాలా పనులు
వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది


నల్లకుంట ప్రధాన రహదారి పక్కన నిలిచిపోయిన నాలా డైవర్షన్ పనులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** పద్మాకాలనీ నుంచి నల్లకుంట హెరిటేజ్ సూపర్‌మార్కెట్ మీదుగా ఫీవర్ ఆసుపత్రి వెనుక గేటు వరకు నిర్మించనున్న నాలా డ్రైనేజీ పనులు నిలిచిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 2021లో సుమారు రూ.72 కోట్లతో ప్రారంభమైన ఈ నాలా డైవర్షన్ పనులు మూడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. గతేడాది క్రితం నాలా డైవర్షన్ పనులు పూర్తి చేసినప్పటికీ ఇంకా మధ్యలో తవ్వకాలు జరిగి నిలిపేశారు. అక్కడ నుంచి ఫీవర్ ఆసుపత్రి వెనుకబాగంలోని శ్రీరామ్‌నగర్ బస్తీ వరకు నిర్మించనున్న పనులు సైతం ఆగిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. హనుమాన్ దేవాలయం వద్ద తవ్వకాలు ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

### ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య నలిగిపోతున్న స్థానికులు...

ఆ నాలా అభివృద్ధి పనులు ఇటూ ముషీరాబాద్, అటూ అంబర్‌పేట నియోజకవర్గాలకు చెందినవి కావడంతో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్‌లు గతంలో పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్లకు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసిన ప్పటికీ వారిని పట్టించుకోవడం లేదనే పలువురు అభిప్రాయపడుతున్నారు.

### పర్యవేక్షణ లోపం..

గతేడాది నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు సైతం నాలా పనులపై పర్యవేక్షణ చేయకపోవడంతో అక్కడక్కడ పనులు ఆగిపోయాయి. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేలకు చెప్పుకోలేక స్థానిక ప్రజలు నలిగిపోతున్నారు.

### మూడేళ్లుగా కొనసాగుతూనే...

2021లో ప్రారంభమైన ఈ పనులు దశల వారీగా కొనసాగిస్తున్నారే తప్పా.. నిరంతరం పనిచేయిస్తూ పనులు పూర్తి చేయాలనే ధోరణిలో కాంట్రాక్టర్లు, అధికారులు లేకపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ముఖ్యంగా ప్రధాన రహదారి కావడంతో అప్పుడప్పుడు భారీ వాహనాలు ఆగిపోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

### అధికారులు పట్టించుకోవడం లేదు..



నాలా డైవర్షన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, ఎమ్మెల్యేలకు అనేక సార్లు మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయింది. రెండున్నర ఏళ్లుగా పనులు నిర్వహించి మధ్యలోనే పనులను నిలిపేశారు. దీంతో నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరైంది. రెండు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలి.

– రితీష్‌కుమార్, నాలా బాధితుల సంఘం అధ్యక్షుడు

## ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు.. నేడు ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్

**కాచిగూడ:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (నిఫ్డ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు ఈనెల 23న ఆదివారం స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ రాముయాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గార్మెంట్ మేకింగ్, డిజైనింగ్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, ప్యాటర్న్ మేకింగ్, ఫ్యాబ్రిక్ కటింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు కొత్తపేటలోని నిఫ్డ్ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాయవచ్చని తెలిపారు. వివరాలకు 90306 10033/55.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



**సుందరయ్య విజ్ఞాన కేంద్రం :** కళాభూమి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాట్యగురువు సంధ్యాకుమారి జోషి మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికే తలమానికమని అన్నారు. నృత్యం మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుఢ్యం, ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. కళాభూమి వ్యవస్థాపకులు శ్రీవల్లి, ప్రసాదరావు, కళాకారులు శిల్ప చక్రవర్తి, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

## 24న పైడి లక్ష్మయ్యసంజీవరెడ్డి స్మారక పురస్కారాలు

**చిక్కడపల్లి:** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నతాధికారిగా పనిచేసిన పైడి లక్ష్మయ్య కుమారుడు పైడి సంజీవరెడ్డి పేరిట స్మారక పురస్కారాలు ఈనెల 24న త్యాగరాయ గానసభలో ప్రదానం చేయనున్నట్లు డాక్టర్ ఎం.కె.రాము ప్రకటించారు. ముఖ్యఅతిథిగా ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చల్ల కోదండరాం పాల్గొని పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

## సేవాలాల్ సేనా హైదరాబాద్ జిల్లా కన్వీనర్ నియామకం


నియామకపత్రాన్ని అందుకుంటున్న కళ్యాణ్‌నాయక్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం :** సేవాలాల్ సేనా హైదరాబాద్ జిల్లా కన్వీనర్‌గా బాగ్‌లింగంపల్లి లంబాడి తాండాకు చెందిన వర్‌త్యా కళ్యాణ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సేవాలాల్ సేనా రాష్ట్ర కమిటీలో సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. రమేష్‌మహరాజ్, సైదానాయక్, వెంకన్న, హుస్సేన్, శోభానాయక్, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రికి శుభాకాంక్షల వెల్లువ


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఓబీసీ నేతలు




కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి నోట్‌బుక్స్ అందజేస్తున్న బీజేపీ నేతలు

**అంబర్‌పేట:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆ పార్టీ ఓబీసీ మోర్చా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి నగరానికి విచ్చేసిన ఆయనకు శనివారం ఆయన నివాసం వద్ద శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు నందనం దివాకర్, ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులు సురేందర్‌యాదవ్, చీర శ్రీకాంత్, సంజయ్, రమేష్‌గౌడ్, నాయకులు రమేష్, వెంకటేష్, రాజేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

**కవాడిగూడ :** సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డి రెండోసారి కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయనకు దోమలగూడ మాజీ కార్పొరేటర్ రవీందర్, ప్రభాకర్, శ్రీనివాస్ ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.

### ఫ్లవర్‌బొకేలు, శాలువాలు తీసుకురావొద్దు..

**కాచిగూడ :** తనను కలిసి శుభాకాంక్షలు తెలియజేయాలనుకునే వారు ఫ్లవర్ బొకేలు, శాలువాలు తీసుకురాకుండా విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్‌బుక్స్, స్టేషనరీ, పెన్నులు అందజేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ హరిచరణ్, జిల్లా కార్యదర్శి డాక్టర్ పుట్ట పాండురంగయ్య ఆధ్వర్యంలో బీజేపీ నేతలు శనివారం బర్కత్‌పురలోని కిషన్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు కిషన్‌రెడ్డికి పిల్లలకు ఉపయోగపడేలా నోట్‌బుక్స్‌ను అందజేశారు. బీజేపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజేందర్, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత మధుమేహ వైద్య పరీక్షలు

**చిక్కడపల్లి :** లయన్స్‌క్లబ్ హైదరాబాద్ హెల్త్ సిటీ, సెన్సార్‌కోర్ మెడికల్ ఇన్స్ట్రుమేంటేషన్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలోని శ్రీసాయి డయగ్నస్టిక్ సెంటర్‌లో ఉచిత మధుమేహ పరీక్షలు (ఎఫ్‌బీఎస్, పీసీబీఎస్, ఆర్‌బీఎస్)ను నిర్వహిస్తున్నామని క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ లయన్ డాక్టర్ జీకే రమణ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో 40 క్లబ్‌లు పాల్గొంటాయని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9849031601.

## పొదుపుతో పేదరికం దూరం


పాస్ పుస్తకాన్ని అందుకుంటున్న చిన్నారి

**ఉస్మానియా యూనివర్సిటీ:** పొదుపుతో పేదరికాన్ని దూరం చేయవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం యూపీఎస్సీ–2024 ర్యాంకర్లు నిరుపేద బాలికల కోసం ఓయూ క్యాంపస్ యూనివర్సిటీ పోస్టాఫీసులో స్ఫూర్తి పేరుతో సుకన్య సమృద్ధి ఖాతా పాస్ పుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పొదుపు చేసి పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది నిరుపేద బాలికలకు రూ.1000తో జమ చేసిన సుకన్య సమృద్ధి ఖాతా పాసు పుస్తకాలను అందజేశారు. యూపీఎస్సీ 3వ ర్యాంకర్ అన్యనరెడ్డి, ఐపీఓఎస్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూపీఎస్సీ ర్యాంకర్లతో పాటు పిల్లల తల్లిదండ్రులతో పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత, నర్సింహరెడ్డి, రాంరెడ్డి, అనురాగ్‌సింగ్, సుధాకర్‌రెడ్డి, నర్సింహరావు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్ సరికాదు

**ముషీరాబాద్:** విద్యార్థి యువజన సంఘాల నాయకులను అరెస్టు చేయడం అక్రమమని దీనిని పీడీఎస్‌యూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల పక్షాన మాట్లాడాలని కోరుతూ శాంతియుతంగా హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ఎదుట నిరసన చేసిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇంటి ఎదుట నిరసన చేసిన విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీచార్జీ అమానుషమన్నారు. నీట్ విద్యార్థుల తరఫున గొంతువిప్పుతున్న నేతల అక్రమ అరెస్టులను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు బీహార్ పోలీసులు 14 మందిని అరెస్టు చేశారని, ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తుపై విద్యార్థులకు నమ్మకం లేదని అభిప్రాయపడ్డారు. తక్షణమే సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి స్పందించి ఎన్‌టీఏను రద్దు చేసి, నీట్ పరీక్ష పత్రం లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. అరెస్ట్ చేసిన విద్యార్థి సంఘాల నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 'సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం చారిత్రాత్మకం'


కొత్తకుర్మ సత్తయ్య

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని టిస్కాబ్ వైస్ చైర్మన్ రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తెలిపారు. ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, సాహసోపేతమని కొనియాడారు. ఈ నిర్ణయం ద్వారా మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా సీఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సహకార బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన సుమారు 46 వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒకేసారి రూ.31 వేల కోట్లు చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తూ.. ప్రజాపాలన అందిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం


అన్నదానంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

**కాచిగూడ :** చెప్పల్‌బజార్, ఇందిరానగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ రెండో వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహపూజ, చండీయాగం, హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమ, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, కేసరి నర్సింగ్‌యాదవ్, కృష్ణకుమార్, శీర్‌సాగర్, బల్వీర్, అశోక్, ఆనంద్, ఆర్.సంతోష్, కృష్ణ, వెంకటేష్, సూరి, రాజ్‌కుమార్, సాయిబాబా, కపిల్, ప్రశాంత్, వివిధ పార్టీల నేతలు, స్థానిక ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

## వినతిపత్రం అందజేత


ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానిక నేతలు

**చిక్కడపల్లి :** గాంధీనగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో ఉన్న అదనపు స్థలాలు జీవో 58,59 ప్రకారం గతంలో మాదిరిగానే మార్కెట్ విలువ ప్రకారం 25 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయాలని ఎస్సార్టీ, టీఆర్టీ క్వార్టర్స్ బస్తీవాసులు శనివారం సాయంత్రం రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్తీ నాయకుడు మల్లేష్ మాట్లాడుతూ.. 2014 గత ప్రభుత్వం జీవో 58,59 విడుదల చేసిందని, దానిని అనుసరించి ఎస్సార్టీ క్వార్టర్స్‌లోని కొంతమంది అదనపు స్థలాన్ని 25 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. మరో 150 మంది కార్మికులు ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోలేదన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 2021లో దరఖాస్తులు చేశారని, ఆ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జీవో 59 ప్రకారం తమ స్థలాలను రిజిస్ట్రేషన్‌కు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. మారిశెట్టి నర్సింగ్‌రావు, ఎన్.కృష్ణ, గుండు జగదీశ్‌బాబు, మహేందర్, ఎండీ నజీర్, ఆకాష్, కుమారస్వామి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## హిందీ విద్యాలయంలో యోగా వేడుకలు

**కాచిగూడ:** అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని శనివారం కాచిగూడలోని మర్వాడి హిందీ విద్యాలయంలో యోగా డేను నిర్వహించారు. విద్యార్థినీవిద్యార్థులకు యోగాలో శిక్షణనిచ్చి యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కాచిగూడ:** రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) ఆర్ట్స్ కాలేజీ – సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ల మధ్య రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.